సాక్షి వైఎస్సార్ జిల్లా

శనివారం । 3 । జూన్ । 2023



ఎర్రస్మగ్లర్లపై దాడులు

నలుగురు స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడు ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం చేసుకున్నారు. -8లో..



లోకేష్ ఆరోపణలు సత్యదూరం

ప్రొద్దుటూరు పాదయాత్రలో లోకేష్ తనపై చేసిన ఆరోపణలు సత్యదూరమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. -8లో..



గంజాయి ముఠా అరెస్టు

గంజాయి స్మగ్లర్ల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ముగ్గురు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉన్నారు. -8లో..

న్యూస్‌రీల్

సోషల్ వెల్ఫేర్ డీడీగా సరస్వతి



కడప రూరల్: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ (సోషల్ వెల్ఫేర్) డిప్యూటీ డైరెక్టర్‌గా సరస్వతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈమె కృష్ణా జిల్లా డీడీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఆ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న జయప్రకాష్ ఏలూరు జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు.

ఐసీడీఎస్ పీడీగా శ్రీలక్ష్మి



కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎంఎస్ రాణి స్థానంలో దేవిరెడ్డి శ్రీలక్ష్మిని నియమించారు. ఈమె అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇప్పటివరకు పనిచేస్తున్నారు. కాగా, ఎంఎస్ రాణికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

జిల్లా రిజిస్ట్రార్‌గా పీవీఎన్ బాబు



కడప కోటిరెడ్డిసర్కిల్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా తిరుపతి నుంచి పీవీఎస్ బాబును బదిలీ చేశారు. కడపలో పనిచేస్తున్న చెన్న కేశవరెడ్డి నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు.

మార్కెటింగ్‌శాఖ డీడీగా శ్రీకాంత్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: కడప మార్కెటింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈయన ఆదోనిలో పనిచేస్తూ ప్రస్తుత బదిలీల్లో కడపకు వస్తున్నారు. కడపలో డీడీగా పనిచేస్తున్న లావణ్య విజయవాడకు బదిలీ అయ్యారు. డీడీగా నియామకమైన శ్రీకాంత్‌రెడ్డి నేడో, రేపో బాధ్యతలను స్వీకరించనున్నారు.

శరవేగంగా పింఛన్ల పంపిణీ

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద వలంటీర్ల ద్వారా పింఛన్ల నగదు పంపిణీ శరవేగంగా జరుగుతోంది. మొత్తం 2,52,913 పింఛన్లకు మొత్తం రూ 69,76,85,500 పంపిణీ చేయాలి. అందులో భాగంగా రెండవ రోజైన శుక్రవారం 2,40,301 మంది పింఛన్లకు గాను రూ 66,31,28,500 పంపిణీ చేశారు. దీంతో రాత్రి 8 గంటలకు 95.06 శాతం నమోదైంది.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌లో 30 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు ఆర్‌సెట్ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన నిరుద్యోగ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని.. ఈనెల 5వ తేదీ నుంచి శిక్షణను ప్రారంభిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 63028 33546 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రైతన్నకు యంత్ర సేవ

- ఆర్బీకే, క్లస్టర్ కేంద్రాలకు ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు
- రాయితీ కింద రూ. 226.50 లక్షలు విడుదల
- కలెక్టర్ విజయరామరాజు





ట్రాక్టర్ల పంపిణీని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి (ఇన్‌సెట్) ట్రాక్టర్ నడుపుతున్న దృశ్యం

కడప సెవెన్‌రోడ్స్ : వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గుతుందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం గుంటూరులో వైఎస్సార్ యంత్ర సేవ పథకం 2022–23 మెగా మేళా -2ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, రైతులు కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు.

- అనంతరం కలెక్టర్ విజయరామరాజు రైతు భరోసా కేంద్రాల కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల గ్రూపులకు, క్లస్టర్ స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల గ్రూపులకు ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్ల పంపిణీ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్ర సేవా పథకం ద్వారా తక్కువ అద్దెకే రైతులకు యంత్ర పరికరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లాలో రూ. 5150.15 లక్షల వ్యయంతో విత్తు నుంచి కోత వరకు రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచుతోందన్నారు. ఆర్బీకే స్థాయిలో 432 యంత్ర సేవా కేంద్రాలకు ఒక్కో దాంట్లో రూ. 15 లక్షల విలువైన పరికరాలు సమకూరుస్తోందన్నారు. వరి ఎక్కువగా పండించే 20 క్లస్టర్ స్థాయి యంత్ర సేవా కేంద్రాలకు ఒక్కోచోట రూ. 25 లక్షల విలువైన కంబైన్డ్ హార్వెస్టర్లను అందిస్తున్నామన్నారు. యంత్ర పరికరాలు, వాటి అద్దె, సంప్రదించాల్సిన వ్యక్తుల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తారన్నారు. యాంత్రీకరణలో భాగంగా దుక్కిదున్నే యంత్రాలు, దమ్ము, చదును, వరి నాటు, నూర్పిడి, కోత, ఎరువులు, సస్యరక్షణ, కలుపుతీత తదితర పనులకు యంత్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. సాగు యంత్రాలు, వ్యవసాయ పనిముట్లను 40 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు ద్వారా 50 శాతం రుణంగా తక్కువ వడ్డీకి ఇస్తున్నామన్నారు. జిల్లాలోని 47 ఆర్బీకే కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల గ్రూపులకు, నాలుగు క్లస్టర్ స్థాయి గ్రూపులకు ప్రభుత్వం 226.50 లక్షల రూపాయలు రాయితీగా విడుదల చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఉద్యానశాఖ డీడీ రాజీవ్ మైఖేల్, డీసీసీ అధికారి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు ధన్యవాదాలు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను అమలులో పెడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. వ్యవసాయ రంగానికి ఆయన పెద్దపీట వేస్తున్నారు. యంత్ర సేవా పథకం ద్వారా రాయితీ అందుకోవడం మా అదృష్టం. – గజ్జల పెద్ద వేమారెడ్డి, గోపవరం, ప్రొద్దుటూరు మండలం

రైతులకు స్వర్ణయుగం



రైతు భరోసా సాయాన్ని వరుసగా ఐదేళ్లు అందుకోవడంతో పాటు యంత్ర సేవా పథకం సబ్సిడీలు కూడా పొందడం ఆనందంగా ఉంది. దీంతో వ్యవసాయం పట్ల రైతులకు మరింత ధీమా పెరుగుతోంది. సీఎం వైఎస్ జగన్ పాలన రైతుల పాలిట స్వర్ణయుగంగా చెప్పవచ్చు. – మన్సూర్ అహ్మద్, ఖాదర్‌పల్లె, చాపాడు మండలం

తలెత్తుకుని జీవిస్తున్నాం



వైఎస్ జగన్ సీఎం అయ్యాక రైతులు తలెత్తుకుని జీవించే పరిస్థితి ఏర్పడింది. దేశమంతా కరోనా తాండవించిన సమయంలోనూ రైతుల సంక్షేమాన్ని సీఎం విస్మరించలేదు. రైతుల కోసం యంత్ర సేవ లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తుండడం అభినందనీయం. –నరసింహారెడ్డి, ఊడవగండ్ల, తొండూరు మండలం

నష్టాల నుంచి బయటపడ్డాం



రైతు భరోసాతోపాటు యంత్ర సేవా పథకం వల్ల రైతులకు వ్యవసాయ పెట్టుబడి వ్యయం తగ్గింది. దీంతో మేము నష్టాల నుంచి బయటపడగలిగాం. ఇచ్చిన హామీల కంటే రైతులకు అదనంగా సాయం చేయడం సంతోషదాయకం. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. – ఉమ్మడి హరి, మాధవరం, సిద్దవటం మండలం

నేడు అరుణాచలానికి ఏసీ ఇంద్ర బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌర్ణమిని పురస్కరించుకుని కడప డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలానికి ఏసీ ఇంద్ర బస్సు నడుపుతున్నామని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. సర్వీసు 93800కు ప్రయాణికులు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. పెద్దలకు రూ. 1350, పిల్లలకు రూ. 1040గా టిక్కెట్‌గా నిర్ణయించామన్నారు. శనివారం రాత్రి 9.30 గంటలకు కడపలో బయలుదేరి మరుసటిరోజు ఉదయానికి అరుణాచలానికి చేరుతుందన్నారు. తిరిగి ఆదివారం రాత్రి 8.00 గంటలకు అక్కడ బయలుదేరి మరుసటిరోజు ఉదయం కడపకు చేరుతుందన్నారు. రిజర్వేషన్ కౌంటర్ ద్వారా లేదా ఆన్‌లైన్‌లో సీట్లను రిజర్వేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

రిమ్స్‌లో ఎన్ఎంసీ బృందం పర్యటన



కడప రిమ్స్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎన్ఎంసీ అధికారులు

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్)లో ఈఎన్‌టీ (చెవి,ముక్కు, గొంతు) విభాగంలో పీజీ సీట్ల గుర్తింపు కోసం నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) అధికారుల బృందం శుక్రవారం పర్యటించింది. కర్ణాటకలోని మాండ్యా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఈఎన్‌టి హెచ్‌ఓడిగా పనిచేస్తున్న డాక్టర్ హనుమంత్ ప్రసాద్ తదితరులు ఆయా విభాగాలను పరిశీలించడంతో పాటు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ విభాగంలో ఇప్పటికే మూడు పీజీ సీట్లు వున్నాయి. వీటిలో ఒక సీటుకు గుర్తింపు లభించింది. మరో రెండు సీట్ల కోసం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ, ఈఎన్‌టీ హెచ్‌ఓడీ డాక్టర్ భాస్కరన్, డాక్టర్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి హాని కలిగించవద్దు



విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పర్యవేక్షక ఇంజనీరు ఎస్. రమణ

కడప కార్పొరేషన్: పర్యావరణానికి హాని కలిగించని రీతిలో మానవ జీవన శైలి ఉండాలని విద్యుత్ శాఖ(ఆపరేషన్) పర్యవేక్షక ఇంజనీరు ఎస్. రమణ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో పర్యావరణాన్ని రక్షించడానికి, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) కార్యక్రమం నిర్వహించి, అధికారులు, ఉద్యోగులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనరులను వివేకం లేని, విధ్వంసకర వినియోగానికి బదులుగా బుద్ధి పూర్వక, ఉద్దేశపూర్వక వినియోగం కోసం 'లైఫ్' అనే మహత్తర కార్యక్రమం చేపట్టారన్నారు. ప్రజలు ప్రకృతితో సమకాలికమైన, హాని కలిగించని జీవన శైలిని ఆచరించాలన్నారు. ఇందులోభాగంగా విద్యుత్ ఆదా చేయుటకు ఎల్ఈడీ బల్బులు వాడటం, ఎయిర్ కండీషనర్ల ఉష్ణోగ్రత 24 డిగ్రీల వద్ద ఉంచడం, నీటిని చల్లబరుచుకోవడానికి రిఫ్రిజిరేటర్‌కు బదులు కుండలు వాడటం, తరచుగా వాడే ఎలక్ట్రానిక్ వస్తువులకు స్మార్ట్ స్విచ్‌లను ఏర్పాటు చేసుకోవడం, గీజర్ల స్థానంలో సోలార్ హీటర్లు వాడటం, పగటిపూట లైట్లు, ఫ్యాన్లకు బదులు సహజ గాలిని, వెలుతురును వాడుకోవడం వంటి పద్ధతులు పాటించాలన్నారు. ప్రజా రవాణాకు ఇంధన ఖర్చు తగ్గించడం, స్వల్ప దూరాలకు సైకిల్ వాడటం, ట్రెడ్‌మిల్‌కు బదులు బయట పరుగెత్తడం వంటివి చేయాలన్నారు. మొక్కలను విరివిగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్. నరసింహ ప్రసాద్, సోమ శ్రీనివాసులు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జి. మధుకుమార్, అకౌంట్ ఆఫీసర్ మల్లికార్జున, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు

- 51 యూనిట్లకు రూ. 7.62కోట్ల రాయితీ
- కలెక్టర్ విజయరామరాజు



జమ్మలమడుగు: తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా అయ్యే వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు డీఐఈపీసీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలే జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువుపట్టు అన్నారు. ఆ దిశగా జిల్లా పారిశ్రామిక అభివృద్ధిని ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. పారిశ్రామికాభివృద్ధితో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ ఔత్సాహికులను ప్రోత్సహించాలని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 2015–20, 2020–23లను అనుసరించి అన్ని సెక్టార్లలోని మొత్తం 51 యూనిట్లకుగాను రూ. 7.62 కోట్ల రాయితీ విడుదలకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం జయలక్ష్మి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ జావీద్‌బాషా, వాణిజ్య పన్నులు, ఏపీఎస్ పీడీసీఎల్, కార్మికశాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత పౌరులందరికీ ఉందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. ఈనెల 5వ తేదీన పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ అధికారులు రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ శుక్రవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈనెల 5వ తేదీ ఉదయం 8 గంటలకు కడప కోటిరెడ్డిసర్కిల్ నుంచి కొత్త బస్టాండు వరకు గ్రీన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి జిలా పర్యావరణ ఇంజనీరు కె.జావీద్‌బాష తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం జయలక్ష్మి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది అనిల్‌కుమార్‌రెడ్డి, నవీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శిల్క్ వస్త్రాల పరిశీలన

జమ్మలమడుగు: మండల పరిధిలోని మోరగుడి గ్రామంలో శ్రీచౌడేశ్వరి శిల్క్ సొసైటీని జిల్లా కలెక్టర్ విజయరామరాజు తనిఖీ చేశారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్.. ఆర్డీఓ జి.శ్రీనివాసులుతో కలిసి చౌడేశ్వరిదేవి శిల్క్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులతో శిల్క్ వస్త్రాల తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శిల్క్ సొసైటీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తమ సొసైటీ నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి స్వామి వారికి వస్త్రాలను సరఫరా చేస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సొసైటీలో పనిచేస్తున్న కార్మికుల గురించి, సొసైటీ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి పసుపు కొనుగోలు

- జిల్లాలో 6 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- 5556 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా అడుగులు
- మార్కెట్ ధరకంటే అదనంగా ధర చెల్లింపు
- మైదుకూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్న జేసీ



కడప మార్కెట్ యార్డులో అమ్మకానికి తెచ్చిన పసుపుకొమ్ములు

కడప అగ్రికల్చర్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతన్నలను అడుగడుగునా ఆదుకుంటోంది. పంట దిగుబడులను అధిక రేట్లతో కొనుగోలు చేస్తోంది. మొన్న శనగలను బహిరంగ మార్కెట్‌కంటే అధిక ధర చెల్లించి కొనుగోలు చేసిన ప్రభుత్వం తాజాగా పసుపు కొనుగోలును కూడా ప్రారంభిస్తోంది. ప్రస్తుతం పసుపుధర బహిరంగ మార్కెట్‌లో నాణ్యతను బట్టి కింట్వాల్ రూ. 5300 నుంచి రూ.5900 వరకు ధర పలుకుతోంది. అలాంటిది ప్రభుత్వం మాత్రం క్వింటాల్ పసుపు మద్దతుధరను రూ. 6850 చెల్లించనుంది. దీంతో పసుపు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో రైతుల నుంచి 5556 మెట్రిక్ టన్నుల పసుపు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో పసుపు అధికంగా సాగు చేసే సిద్దవటం, పోరుమామిళ్ల, మైదుకూరు, ఖాజీపేట, జమ్మలమడుగు, పెండ్లిమర్రి మండలాల పరిధిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి రైతు వద్ద నుంచి 30 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయనున్నారు. ఈ కేంద్రాలను శనివారం ప్రారంభించనున్నారు. మైదుకూరులోని పసుపు కొనుగోలు కేంద్రాన్ని జేసీ గణేష్‌కుమార్ ప్రారంభించనున్నారు.

జిల్లాలో 4784 ఎకరాల్లో సాగు...

జిల్లావ్యాప్తంగా 25 మండలాల్లో 153 రైతు భరోసా కేంద్రాల పరిధిలో గత ఖరీఫ్‌లో 4122 మంది రైతులు 4784 ఎకరాల్లో పసుపు పంటను సాగు చేశారు. 16120 మెట్రిక్ టన్నులు దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో పసుపు కొనుగోలుకు సంబంధించి ఇప్పటి వరకు 2362 మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరి ద్వారా నేటి నుంచి పసుపు కొనుగోలు చేయనున్నారు. ఈ పసుపు కొనుగోలును ఈ నెల 12వ తేదీ వరకు మాత్రమే కొనసాగించనున్నారు.

నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా...



పసుపు కొనుగోలుకు సంబంధించి జిల్లాలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఏర్పాటు చేసిన కేంద్రాలలో నేటి నుంచి కొనుగోలు ప్రారంభిస్తాం. పసుపు కొనుగోలుకు సంబంధించి ఖచ్చితంగా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు చేస్తాం. – తాడిగొట్ల నరసింహారెడ్డి, డీఎం, మార్క్‌ఫెడ్

గాండ్రింపులులు

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 8–10 మధ్య పులులు
- శ్రీశైలం బయోల్యాబ్‌లో విశ్లేషణ ప్రక్రియ
- డేటాలోని చిత్రాలు పరిశీలన
- ఎఫ్‌డీపీసీ ఆధ్వర్యంలో చేపట్టిన పులుల గణన
- వివిధ రేంజిలలో 376 కెమెరాలు ఏర్పాటు



రాజంపేట: శ్రీశైలం నుంచి శేషాచలం వరకు విస్తరించి ఉన్న అభయారణ్యంలో పులుల గాండ్రింపులు వినిపిస్తున్నాయి. వైఎస్సార్, అన్నమయ్య, గిద్దలూరు, తిరుపతిలో టైగర్ కారిడార్ కొనసాగుతోంది. నాగార్జున సాగర్‌లోని శ్రీశైలంలో టైగర్ రిజర్వు అటవీ ప్రాంతంలో గుండ్ల బ్రహ్మేశ్వర వైల్డ్‌లైఫ్ అభయారణ్యం నుంచి టైగర్ కారిడార్ ప్రారంభమైంది.

పులుల గణన...

శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు (ఎఫ్‌డీపీసీ) ఆధ్వర్యంలో పులుల గణన చేపడుతున్నారు. పులుల గణన రెండు బ్లాకులలో జరుగుతుంది. నాలుగేళ్లకొకసారి చేసే గణన బ్లాక్–3లోకి వస్తుండగా , ప్రతి ఏడాది జరిపే గణన బ్లాక్–4 కిందికి వస్తుంది. ఇటీవల బ్లాక్–4లోని వార్షిక గణనలో టైగర్ కారిడార్ ప్రాంతంలో ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి అటవీ శాఖాధికారుల గణన ప్రక్రియ ప్రారంభమైంది.

పెరుగుతున్న పులుల సంఖ్య..

2021లో ఆరు పులులు ఉండగా, 2022లో వాటి సంఖ్య తొమ్మిదికి చేరినట్లు అటవీ వర్గాల సమాచారం. 2019లో బద్వేలు, సిద్ధవటం అటవీ ప్రాంతాల్లో కూడా పులులు ఉండేవని అప్పటి సమాచారం. ఈ సారి గణనలో అవి కెమెరాలకు చిక్కలేదు. అయితే పెనుశిల అభయారణ్యం, శేషాచలం అటవీ ప్రాంతాల వైపు వెళ్లినట్లు అటవీవర్గాలు భావిస్తున్నాయి.

ఎక్కడెక్కడ..

టైగర్ కారిడార్ నంద్యాల, గిద్దలూరు, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి డివిజన్లలో నిర్వహించారు. నంద్యాల డివిజన్‌లోని చలమరుద్రవరం (రేంజ్), గిద్దలూరులో గుండ్లకమ్మ, వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు, వనిపెంట, పోరుమామిళ్ల, బద్వేలు, సిద్ధవటం, ఒంటిమిట్ట, ముద్దనూరు, అన్నమయ్య జిల్లాలో చిట్వేలు, రాయచోటి , బాలపల్లె తిరుపతి జిల్లాలో భాకరాపేట, తిరుపతి రేంజిలోని అటవీ ప్రాంతాల్లో సాంకేతిక డిజిటల్ కెమెరాలు అమర్చి సర్వే చేశారు.

డేటాలో చిత్రాలు శ్రీశైలం బయోల్యాబ్‌కు ..

ఆయా రేంజిలలో 188 లోకేషన్లకు గాను మొత్తం 376 కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 127 కెమెరాలు అమర్చారు. 40 రోజుల పాటు జరిగిన గణనలో 20 రోజులకొకసారి కెమెరాలు తీసి వాటిలోని చిత్రాలను సేకరించారు. అదే ప్రదేశాలలో మళ్లీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

మార్చినెలాఖరుకు గణన పూర్తి...

రెండవ విడతలో జరిపిన గణన మార్చినెలాఖరు నాటికి పూర్తికావడంతో అన్ని డివిజన్‌లలో అమర్చిన కెమెరాల్లోని డేటాను ఆయా అటవీశాఖాధికారులు శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌కు పంపారు. వాటిలోని చిత్రాలను బయోల్యాబ్ ప్రతినిధులు క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. పోరుమామిళ్ల, వనిపెంట అడవుల్లో ఆరు పులులు కెమెరాలకు చిక్కినట్లుగా అటవీ అధికారుల నుంచి అందిన ప్రాథమిక సమాచారం.

ప్రాథమికంగా 8 నుంచి 10 పులుల సంచారం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని టైగర్ కారిడార్ చేపట్టిన పులుల గణనలో ప్రాథమికంగా 8 నుంచి 10 లోపు పులులను అధికారులు గుర్తించారు. పులుల వార్షిక గణనలో భాగంగా అడవుల్లో అమర్చిన విదేశీ సాంకేతిక డిజిటల్ కెమెరాల ద్వారా వాటి సంఖ్యను కొనుగొన్నారు. పలుల గణన ప్రక్రియ ఇటీవల ముగియగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మొత్తం ఎన్ని పులులు ఉన్నాయో పక్కాగా నిర్ధారించే పరిస్థితులు ఇంకా కనిపించడంలేదు. దానికి శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌లో శాస్త్రవేత్తలు కెమెరాల్లో లభ్యమైన చిత్రాలపై విశ్లేషణ చేసి నిర్ధారించనున్నారు.

కెమెరాల్లో లభ్యమైన చిత్రాలు టైగర్ ల్యాబ్‌కు పంపాం



జిల్లాలోని పలు రేంజ్‌లలో పులుల గణన నిమిత్తం కెమెరాలను ఏర్పాటుచేశాం. టైగర్ జాడ కోసం ఏర్పాటుచేసిన కెమెరాల్లో లభ్యమైన చిత్రాలు శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌కు పంపాం. డేటాలోని చిత్రాల పరిశీలన కొనసాగుతోంది. పులుల సంఖ్య త్వరలో వెల్లడవుతుంది. – పీవీ సందీప్‌రెడ్డి, డీఎఫ్ఓ, కడప

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు. మృతుడికి సుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉంటుందన్నారు. పింక్ కలర్ ఫుల్ చొక్కా, కలర్ లుంగీ ధరించి ఉన్నాడని, గడ్డం ఉందని తెలిపారు. ఇతన్ని ఎవరైనా గుర్తు పడితే ఎర్రగుంట్ల రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

తప్పిన ప్రమాదం



రహదారి మధ్యలో ఆగిన బస్సు, ట్రాక్టర్, టిప్పర్

అట్లూరు : కడప–బద్వేలు ప్రధాన రహదారిపై త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రయాణికులు, స్థానికుల కథనం మేరకు బద్వేలు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు కడప నుంచి బద్వేలు వెళుతూ అట్లూరు క్రాస్‌రోడ్డులో ఆగింది. ప్రయాణికులను దింపుతుండగా ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్ బస్సును క్రాస్ చేసే క్రమంలో ఎదురుగా ట్రాక్టరు వస్తుండడంతో టిప్పర్ డ్రైవర్ బ్రేక్ వేసి నిలిపివేశాడు. బస్సుకు, ట్రాక్టర్‌కు మధ్యలో టిప్పర్ దూరడం వల్ల బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. దీంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే మూడు వాహనాలు రోడ్డుపై ఆగి పోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అట్లూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించి పంపించారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అప్పులబాధతో ఆత్మహత్య

పెద్దముడియం : మండలంలోని దిగువ కల్వటాల గ్రామంలో గువ్వల గురప్ప(54)అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గురప్పకు భార్య,ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తన సొంత భూమి 2.5 ఎకరాలు, కౌలుకు 5 ఎకరాలు తీసుకొని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు.గతంలో పంటలు సరిగా పండకపోవడం,ఈ ఏడాది అకాల వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నటంతో రూ.10 లక్షల మేర అప్పు అయింది.అప్పులు ఇచ్చిన వారు బత్తిడి చేయడం, తీర్చలేనేమోనని మనోవేదనతో గురువారం అర్ధరాత్రి తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.భార్య రామలక్షుమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రస్మగ్లర్లపై దాడులు

- నలుగురు స్మగ్లర్ల అరెస్ట్, ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- నిందితుల్లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ)



నిందితుల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలోని మైదుకూరు మండలం లంకమల్ల అటవీప్రాంతం నుంచి ఎర్రచందనం చెట్లను అక్రమంగా నరికి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పోలీసులు నిఘా ఉంచారు. ఇదే మండలం యాకర్లపాలెం గ్రామం సమీపంలోని తెలుగుగంగ రిజర్వాయర్ సీ– బండ్ వద్ద కొంతమంది స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను వాహనంలోకి లోడ్ చేస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. వారిలో కొందరు పోలీసులపై రాళ్లదాడి చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించగా నలుగురిని అరెస్ట్ చేశారు. శుక్రవారం కడపలోని ×పెన్నార్‌÷కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు. అరెస్టయిన వారిలో తమిళనాడు రాష్ట్రంలో తిరువన్నామలై జిల్లా ముత్నతూర్ గ్రామానికి చెందిన వెలిముత్తు తంగరాజు, పోలూరు తాలూకా బర్కుర్ గ్రామానికి చెందిన వెల్లియన్ సౌందర్ శంకర్, వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం పెద్ద లేవాకు గ్రామం పెరికల రాజశేఖర్, ఖాజీపేట మండలం ముత్తలూరుపాడు గ్రామానికి చెందిన టి. రామసుబ్బారెడ్డి ఉన్నారు. వీరిలో రాజశేఖర్ గతంలో 2004– 2013 వరకు రైల్వేకోడూరులో ఫారెస్ట్ గార్డ్‌గా పనిచే శాడు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సహకరించడంతో ఇతనిపై కేసు నమోదు చేసి విధుల నుంచి తొలగించారు. అనంతపురం జిల్లా పెనుగొండలో ఒక ఎర్రచందనం కేసు ఉంది. ఇతనితో పాటు అరెస్టయిన టి. రామసుబ్బారెడ్డి గంజికుంట సెక్షన్, నీలాపురం బీట్ ఆఫ్ వనిపెంట రేంజ్‌లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. స్మగ్లర్ల నుంచి 300 కిలోల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలను, కారును, ద్విచక్రవాహనాన్ని నాలుగు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, టాస్క్‌ఫోర్స్, ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబుల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సీఐ ఎం. నాగభూషణ్, మైదుకూరు అర్బన్ సీఐ బి.వి. చలపతి, టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, టీం సభ్యులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

దుంగలు తరలిస్తే కఠిన చర్యలు: ఎస్పీ

జిల్లాలో ఎర్రచందనం చెట్లను నరికినా, దుంగలుగా చేసి అక్రమంగా తరలించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామనీ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు..జిల్లాలో ఈ ఏడాది అరెస్టయిన ఎర్రచందనం స్మగ్లర్లలో ఇప్పటివరకు ఏడుగురిపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించామనీ జిల్లా ఎస్పీ తెలియజేశారు.

33 దుంగల పట్టివేత

పోరుమామిళ్ల : మండలంలోని రామేశ్వరం గ్రామంలో గురువారం రాత్రి కడప టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు ముందుగా తెలిసిన సమాచారంతో రాచకొండు రామయ్య ఇంటిపై దాడి చేసి 33 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితుడు పరారయ్యాడని, అతను గతంలో పోరుమామిళ్ల అటవీశాఖలో ప్రొటెక్షన్ వాచర్‌గా 3 సంవత్సరాలు పని చేసినట్లు తెలిసింది. గంగాయపల్లె, రామేశ్వరం, టేకూరుపేట చెక్‌పోస్టు పరిధిలో పనిచేసిన అతను ఎర్రచందనం గురించి బాగా తెలుసుకొని, ఓ గ్రూపు తయారు చేసుకొని స్మగ్లింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

అట్లూరు మండల పరిధిలో 26 దుంగలు స్వాధీనం

అట్లూరు : మండల పరిధిలో గురువారం రాత్రి అక్రమరవాణాకు సిద్ధంగా ఉంచిన 26 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బద్వేలు, అట్లూరు మండల పరిధిలోని పలువురు ఎర్రచందనం దొంగలను టాస్క్‌పోర్సు పోలీసులు అదుపులోకి తీసుకు విచారించారు. వారిచ్చిన సమాచారం మేరకు పెనుశిల నరసింహా అభయారణ్యం పరిధిలోని ముత్తుకూరు బీట్‌లో గంగప్ప భావి దగ్గర రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన 26 దుంగలను స్వాధీనం చేసకున్నారు.ఈ విషయమై సిద్దవటం రేంజ్‌అధికారి ప్రసాద్‌ను వివరణ అడుగగా దుంగలు దొరికిన విషయం వాస్తవమే అన్నారు. అవి టాస్క్‌పోర్సు పోలీసుల ఆధీనంలో ఉన్నాయని తెలిపారు.

దిశ ఎస్ఓఎస్‌కు మహిళ ఫిర్యాదు

ప్రొద్దుటూరు క్రైం : ఒక వ్యక్తి తనను వెంబడిస్తూ ఫోటోలు తీశాడని ఒక మహిళ దిశ ఎస్ఓఎస్‌కు కాల్ చేసింది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు గుర్తు తెలియని ఒక వ్యక్తి తనను వెంబడించి ఫోటో తీశాడని గురువారం రాత్రి శ్రీనివాసనగర్‌కు చెందిన ఒక మహిళ దిశ ఎస్ఓఎస్‌కు కాల్ చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు రెండు నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే పోలీసులు వచ్చేలోపే అతను అక్కడి నుంచి పారిపోయాడు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలం చెల్లిన వాహనాలు సీజ్



సీజ్ చేసిన వాహనాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : 15 సంవత్సరాలు దాటిన వాహనాలపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కాలం చెల్లిన వాహనాలను తుక్కు కింద పరిగణించాలని రవాణాశాఖకు ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు వాటిని సీజ్ చేస్తున్నారు. కాలం చెల్లిన వాహనాల్లో ఎక్కువగా మినరల్ వాటర్ తరలించే ఆటోలు ఉన్నాయి. సీజ్ చేసిన వాహనాలను రవాణాశాఖ కార్యాలయంలో ఉంచారు.

లోకేష్ ఆరోపణలు సత్యదూరం : రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు యువగళం పాదయాత్రలో లోకేష్ తనపై చేసిన ఆరోపణలు సత్యదూరమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై గతంలో సీబీఐ విచారణను కోరిన సంగతిని గుర్తు చేశారు.వారు కోరుకుంటే దీనిపై కోర్టులో అఫిడవిట్ వేసేందుకైనా సిద్ధమన్నారు. లోకేష్ యువగళం పాదయాత్రను ప్రొద్దుటూరులో అడ్డుకునేందుకు ప్రయత్నించామని ఆరోపించడం సమంజసం కాదన్నారు. ఎందుకుంటే లోకేష్ పాదయాత్ర రూట్ మ్యాప్‌పై ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని పోలీసులు అడిగిన ప్రశ్నకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పానన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు బ్యానర్లు కట్టుకునేందుకు మున్సిపల్ కమిషనర్‌తో అనుమతులు తీసుకున్నా శివాలయం కూడలిలో ఉన్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి కటౌట్‌ను, తదితర వాటిని తొలగించి టీడీపీ బ్యానర్లకు అవకాశం కల్పించామన్నారు. ఇక ఎక్కడ పాదయాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశామో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివద్ధి పనులు జరుగుతున్నా కనీసం రూ.3లక్షలు రోడ్డు వేయలేదనడం లోకేష్ అజ్ఞానానికి నిదర్శమని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హయాంలో ఇల్లు లేని నిరుపేదలకు ఏ ఒక్కరికీ ఇంటి పట్టా ఇవ్వలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 24వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఇందులో 13వేల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఈ డిసెంబర్ నాటికి 12వేల మంది గృహప్రవేశాలు చేయిస్తామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో 8 శాతం పూర్తి చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.120 కోట్లతో తాగునీటి పథకం పూర్తి చేశామన్నారు. మున్సిపల్‌లోని రూ.100 కోట్ల నిధులను కాజేశారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నందం సుబ్బయ్య హత్యకు తనకు ఎలాంటి సంబంధం లేదని చౌడమ్మ సాక్షిగా ఆనాడే స్పష్టం చేశానన్నారు. టీడీపీ కోరుకున్నట్లు ఈ హత్యపై సీబీఐ విచారణకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. తాను కర్రసాము చేస్తూ కాలు తొసికి కింద పడినదాన్ని కూడా లోకేష్ ఎగతాళిగా మాట్లాడటమంటే జాలి, దయలేని వారన్నారు. ఇద్దరు మహిళలతో, బికినీల మహిళలతో ఉన్న లోకేష్ చిత్రాలను ఎమ్మెల్యే చూపించి ఇతను భావితరాల నాయకుడా అని ప్రశ్నించారు. లోకేష్ ఆరోపణలకు ఒకటే సమాధనమని, అది ఏనుగు పోతుంటే కుక్కలు మొరిగినట్లు కుక్క వచ్చి మొరిగింది.. పోయింది అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేను చేస్తామన్న టీడీపీ నాయకుల వ్యాఖ్యలపై స్పందిస్తూ మాజీ ఎమ్మెల్యే కావాలన్నా తాజా మంత్రి కావాలన్నా ప్రజలు, దేవుడు నిర్ణయిస్తారని, ఏది ఏమైనా తన జీవితం ప్రజా సేవకే అంకితమని స్పష్టం చేశారు.



ఇద్దరు మహిళలతో ఉన్న లోకేష్ చిత్రాలను చూపిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

- పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి ప్రొద్దుటూరులో మీడియాలో మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బీసీలకు ఏ విధంగా రక్షణగా నిలుస్తారని అన్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన 600 వాగ్దానాలను తుంగలో తొక్కి మళ్లీ ప్రజలను మోసం చేయడానికి వచ్చాడన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజకీయంగా ఎదుగుదలకు కృషి చేశారన్నారు. బీసీలను గౌరవించడం, రక్షించడం అంటే ఇదేనన్నారు.2024లోనే కాదు జగన్ ఉన్నంత వరకు టీడీపీకి అధికారం రాదని తెలిపారు.

బైక్‌ను ఢీ కొన్న లారీ : ఇద్దరికి గాయాలు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మోడంపల్లె బైపాస్ రోడ్డులో బైక్‌ను లారీ ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు రామేశ్వరానికి చెందిన రాజశేఖర్, ఎర్రగుంట్ల మండలంలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన సుబ్బరాయుడు శుక్రవారం ప్రొద్దుటూరులోని సినీహబ్ సమీపంలో పురుగుల మందుతో పాటు ఇతర వ్యవసాయ సామగ్రి కొనుగోలు చేశారు. వీరిద్దరూ బైక్‌లో మోడంపల్లె ద్విచక్రవెళ్తున్న సమయంలో ఎదురుగా ఆటో రావడంతో బైక్‌ను స్లో చేశారు. అదే సమయంలో వెనుక వైపు నుంచి వస్తున్న లారీ వారి బైక్‌ను ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన సుబ్బరాయుడు మెరుగైన చికిత్స కోసం కడప జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

గంజాయి ముఠా అరెస్టు

- 21.6 కిలోల గంజాయి, బైక్‌లు స్వాధీనం
- అరెస్టయిన వారిలో చెన్నై సవిత ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు



అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ చిత్రంలో స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

కడప అర్బన్ : వైఎస్సార్‌జిల్లా కడప రూరల్ సర్కిల్ చింతకొమ్మదిన్నె పోలీసులు తమ సిబ్బందితో కలిసి ఏడుగురు సభ్యులున్న గంజాయి స్మగ్లర్ల ముఠాను అరెస్ట్ చేశారు.వీరిలో ముగ్గురు చెన్నైలోని సవిత ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కూడా ఉన్నారు. శుక్రవారం కడపలోని ×పెన్నార్‌÷పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఈ సంఘటన వివరాలను తెలియజేశారు. జిల్లాలో గంజాయి విక్రయాల ముఠాలను అరెస్ట్ చేస్తూ నిరంతరం దాడులు చేస్తున్నామన్నారు. ఇటీవలి కాలంలో ఇద్దరిపై పీడీ యాక్ట్ ప్రయోగించామన్నారు. ఈ సంఘటనలో చింతకొమ్మదిన్నె పోలీసులు గంజాయి స్మగ్లింగ్ ముఠాలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. అరెస్టయిన వారిలో మైదుకూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన, ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తిరుపతి వెంకట శివారెడ్డి, గుంటూరు జిల్లా కొట్టం రాజు వీధికి చెందిన ప్రస్తుతం చెన్నైలో నివాసం ఉంటున్న వాగోలు రాహుల్, కడప నగరం అక్కాయపల్లి వీధికి చెందిన గంగిరెడ్డి హరిప్రసాద్ రెడ్డి ప్రధాన నిందితులన్నారు. వీరు ముగ్గురు చెన్నైలోని సవిత ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతూ దురలవాట్లకు బానిసలుగా మారారన్నారు. మిగిలిన నిందితుల్లో కడప నగరం అక్కాయపల్లికి చెందిన మల్లప్పగారి మల్లికార్జున రెడ్డి, కడప నగరం నబీకోటకు చెందిన పాలగిరి పవన్‌కుమార్, కొట్టం ప్రతాప్, పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామంకు చెందిన నరసింహులు ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి 21 కిలోల 600 గ్రాముల గంజాయిని, రెండు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి గంజాయిని కొనుగోలు చేసి చెన్నైకి స్మగ్లింగ్ చేసి, తరువాత అక్కడి నుంచి కడపకు అక్రమంగా తీసుకుని వచ్చి ఇక్కడ విక్రయిస్తారన్నారు. ఇక్కడి నిందితులు కడప నగరంలో, చుట్టు ప్రక్కల ప్రాంతాలకు వెళ్లి గంజాయిని అక్రమంగా విక్రయిస్తూ యువతను మత్తుకు బానిసలుగా మార్చేస్తున్నారన్నారు. గంజాయిని వినియోగించినా, అక్రమ రవాణాకు, విక్రయాలకు పాల్పడినా వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రస్తుతానికి గంజాయిని వినియోగిస్తున్న వారికి ×డీ ఆడిక్షన్‌÷కేంద్రాలకు పంపించి వారికి చికిత్సను అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. విద్యాసంస్థల వద్ద మహిళా పోలీసులతో నిఘా వుంచామన్నారు. ఎవరైనా గంజాయి విక్రయాలు, వినియోగించే వారి సమాచారాన్ని డయల్ 100 లేదా తన ఫోన్ నెంబర్: 94407 96900కు ఇవ్వాలనీ ఎస్పీ సూచించారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాజాప్రభాకర్, కడప తాలూకా సీఐ ఉలసయ్య, చింతకొమ్మదిన్నె ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు విద్యాసాగర్, విశ్వనాథ్‌రెడ్డి, కానిస్టేబుళ్లు జనార్ధన్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినంచారు. నగదు రివార్డులను అందజేశారు.

ముంపువాసులు ఆధార్, అకౌంట్ పుస్తకాలు ఇవ్వాలి

జమ్మలమడుగు/కొండాపురం/ఎర్రగుంట్ల : గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన మొదటి విడత 14 గ్రామాల ప్రజలు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పుస్తకాలు జిరాక్స్ కాపీలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముంపు గ్రామాల ప్రజలకు అదనపు పరిహారం మూడు లక్షల 25వేల రూపాయల జమ చేయాలని సంకల్పించింది. దీంతో జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు ముంపు గ్రామాల బాధితులు వారం రోజుల్లో తమ ఆధార్‌కార్డులు, బ్యాంక్ జిరాక్స్ కాపీలను తహసీల్దార్‌కు ఇవ్వాలని సూచించారు.

- కొండాపురం మండల తహసీల్దార్ శోభనబాబు మాట్లాడుతూ గండికోట జలాశయం కింద ముంపునకు గురైన మొదటి విడత 14 గ్రామాలైన సీతాపురం, గండ్లూరు, చౌటిపల్లె, ఓబన్నపేట, రేపల్లె,బొమ్మేపల్లె,బుక్కపట్నం, దత్తాపురం, ముచ్చుమర్రి, పక్కీరపేట,గంగాపురం,నేదరపేట, దొరువు ముద్దనూరు మండలంలోని కొర్రపాడు గ్రామాలలోని నిర్వాసితులు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం జిరాక్స్ కాపీలు మండల తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఎర్రగుంట్ల తహసీల్దార్ ఎ నాగేశ్వరరావు కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు.

అడవి కుక్కల దాడిలో పొడదుప్పి మృతి



మృతి చెందిన పొడదుప్పి

సిద్దవటం : మండలంలోని ఎస్. రాజంపేట గ్రామ శివారులోని పొలం వద్ద శుక్రవారం ఉదయం అడవి కుక్కల దాడిలో నాలుగు నెలల మగ పొడదుప్పి మృతి చెందిందని రేంజర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అడవిలోనుంచి పొడదుప్పి తాగునీటి కోసం గ్రామ శివారులోకి వచ్చింది. అడవి కుక్కలు తరుముకుంటూ వచ్చి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. స్థానిక రైతు సమాచారం ఇవ్వడంతో సిద్దవటం ఎఫ్‌బీఓ రాజశేఖర్ రెడ్డి మరికొందరు సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిద్దవటం లోని పశువైద్య శాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం సాబ్‌బావి బేస్ క్యాంపు వద్ద ఖననం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, ఎఫ్‌బీఓ రాజశేఖర్‌రెడ్డి, ఏబీఓ హైమావతి, అటవీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని బుగ్గలేటిపల్లి సమీపంలో వంకలో గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి పెట్రోల్ పోసి కాల్చినట్లు కడప రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, సీకె దిన్నె ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డిలు తెలిపారు. వారు తెలిపిన సమాచారం మేరకు మేకల కాపర్లు శుక్రవారం పశువులను మేపుకునేందుకు వంక వద్దకు వెళ్లగా అక్కడున్న ముళ్లపొదల్లో శవాన్ని గుర్తించారు. వెంటనే సీకె దిన్నె పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు.పోలీసులు వెళ్ల మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇతన్ని హత్య చేసి ఆటో సహాయంతో వాగు వద్ద ఉన్న ముళ్లపొదల్లో పడేసి పెట్రోల్ పోసి నిప్పు అంటించి ఉంటారని సీఐ, ఎస్ఐ తెలిపారు. మృతుడి వయస్సు 30–35 వరకు ఉంటుందని, కుడి చేతిపై కె. సుహాసిని అనే పచ్చబొట్టుతో పాటు, మృతుడు గ్రీన్ కలర్ గల్ల చొక్కా, బ్లూ ప్యాంటు ధరించి ఉన్నట్లు గుర్తించామన్నారు. మృతుడి షర్ట్‌కు ఉన్న కాలర్‌పై 5స్టార్ టైలర్స్ అని ఉందన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 91211 00525, 91211 00526 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రామాపురం: రామాపురం మండల పరిధిలోని చిట్లూరు గ్రామ పంచాయితీ పాలన్నగారిపల్లె సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్‌కుమార్ (29) అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న మినీ లారీ పాలన్నగారిపల్లె పరుపుల ఫ్యాక్టరీ వద్దకు రాగానే రాయచోటి నుంచి వస్తున్న గూడ్స్ ఆటోను ఢీ కొనడంతో ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్ చిట్లూరు మాలపల్లెకి చెందిన అశోక్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. బాలిపోగు శ్రీరాములుకు కాలు విరిగింది.

43 మంది డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న 43 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. – కడప సెవెన్‌రోడ్స్

పేరు	ప్రస్తుతం పనిచేస్తోంది	బదిలీ అయినది
ఆర్.రాజేష్‌కృష్ణ	కాశినాయన	సిద్దవటం
ఏవీ రమణమ్మ	కలసపాడు	బద్వేలు
కె.కృష్ణకుమార్‌రెడ్డి	బి.కోడూరు	బద్వేలు ఆర్డీఓ ఆఫీసు
కె.జాన్ విక్టర్ పాల్	బద్వేలు	బి.మఠం
వై.సంజీవరెడ్డి	బి.మఠం	పోరుమామిళ్ల
ఎస్.చంద్రలీల	చెన్నూరు	గోపవరం
డి.వెంకట రమణ	సిద్దవటం	చెన్నూరు
జి.రవిశంకర్	పెద్దముడియం	కలసపాడు
కె.త్రిభువన్‌రెడ్డి	వేముల	లింగాల
జి.విద్యాసాగర్	గోపవరం	బి.కోడూరు
పి.శేషారెడ్డి	లింగాల	వేముల
టి.భవాని	పోరుమామిళ్ల	చాపాడు
పి.రవిశంకర్	బద్వేలు	జీఎస్ఎస్ఎస్, ముద్దనూరు
పి.మల్లికార్జునరెడ్డి	పులివెందుల	స్పెషల్ కలెక్టర్ ఆఫీసు, కడప
పి.రూపేష్ మునిరావు	పులివెందుల	మైలవరం
ఆర్.మల్లికార్జున	కడప	ఆర్డీఓ ఆఫీసు, పులివెందుల
టి.రెడ్డిలక్ష్మి	ముద్దనూరు	ఆర్డీఓ ఆఫీసు, పులివెందుల
పీఎంవీ మనోజ్	కడప	ఎన్‌ఫోర్స్‌మెంట్, కడప
వి.షఫీ	దువ్వూరు	జమ్మలమడుగు
పి.నరేంద్ర	పులివెందుల	కమలాపురం
ఆర్.బాబా ఫక్రుద్దీన్	బద్వేలు	మైదుకూరు
అజయ్‌బాబు	జమ్మలమడుగు	ప్రొద్దుటూరు
పి.శ్రీనివాస్	ఆర్డీఓ ఆఫీసు బద్వేలు	బద్వేలు ఎన్నికల విభాగం
వి.జగదీష్‌బాబు	పులివెందుల	పులివెందుల ఎన్నికల విభాగం
కె.శివారెడ్డి	కలెక్టరేట్	కడప తహసీల్దార్ ఆఫీసు
జె.కెజియ	అట్లూరు	ఖాజీపేట
జి.అమరేశ్వరి	కమలాపురం	ఆర్డీఓ ఆఫీసు, బద్వేలు
కె.అహల్య	సీకే దిన్నె	కమలాపురం
పి.లవన్‌కుమార్	ఒంటిమిట్ట	అన్నమయ్య జిల్లా
ఎస్ఎండీ రోషిన హుసేన్	ఖాజీపేట	అట్లూరు
కె.మీన	మైలవరం	కొండాపురం
జి.మౌనిక	ముద్దనూరు	కలెక్టరేట్
ఎస్.బాలకృష్ణ	కొండాపురం	సీకే దిన్నె
పి.అలీఖాన్	మైదుకూరు	దువ్వూరు
షేక్ అబ్దుల్ ఇస్మాయిల్	కమలాపురం	ముద్దనూరు
పి.అయ్యుబ్‌ఖాన్	పులివెందుల	ఒంటిమిట్ట
ఎస్.చంద్రమౌళి	కడప	కలెక్టరేట్
సి.గుర్రప్ప	జీఎస్ఎస్ఎస్, ముద్దనూరు	తహసీల్దార్ ఆఫీసు ముద్దనూరు
బి.వేణుగోపాల్	ముద్దనూరు	జమ్మలమడుగు
కె.మేరి విజయకుమారి	పులివెందుల	కడప
పి.దేవకుమారి	కడప	పులివెందుల
వి.శ్రీకాంత్	వేముల	కమలాపురం
కె.సతీష్‌కుమార్	కమలాపురం	వేముల